కథ

ఇంతెంత

# అమ్మ పుట్టిల్లు

నెల్లుట్ల రమాదేవి
94406 22781

''ఎంత దూరంలో ఉన్నాం?'' తల్లి ప్రశ్నతో.. కారు కిటికీలోంచి బయటి పరిసరాలు చూస్తున్న శిరీష..

''దగ్గరి కొచ్చేశాం.. పదిహేను నిమిషాలు అంతే! ఎందుకమ్మా .. అలసటగా ఉందా?!'' అని అడిగింది.

ఏమీ లేదన్నట్టు తలూపి.. మళ్లీ కళ్లు మూసుకుంది లలిత. ఇంకొద్దిసేపట్లో తన ఊరొస్తుంది. కేశవను చూడొచ్చు. ఎలా ఉన్నాడో కేశవ?.. ఎంత ఇబ్బంది పడుతున్నాడో! ఏదీ చెప్పడు. తనకు ఏదైనా అయితే మటుకు ఆకాశం, నేలా ఒక్కటి చేస్తాడు.

తన కాలికి ముల్లుగుచ్చితే విలవిల్లాడి పోయేవాడు. తనకేదైనా బాధ కలిగితే వాడి కళ్లలో నీళ్లు తిరిగి ఆ బాధ ప్రతిఫలించేది. ఎవరైనా అలా ఉంటారా అసలు?!

* * *

బడి రోజుల్లో ఓసారి శ్రీహరి వెనుకనుంచి తన రెండు జడలు లాగాడని తెలిసి.. ఎలా చితగ్గొట్టాడో అతణ్ని! ఐదారుగురు కలిస్తేగానీ కేశవను పట్టుకోలేకపోయారు.

''ఈసారి మా అక్కనేమన్నా అన్నావంటే చేతులిరగ్గొడతా!'' అంటున్న కేశవ కళ్లలో కోపాన్ని చూసి మొదటిసారిగా భయపడిన క్షణాలవి!

ఊర్లో హైస్కూల్ ఉన్నా తను ఇంటర్ కోసం పక్క టౌన్‌కు బస్సులో వెళ్లి రావాలని తెలిసి, కేశవ టీసీ తీసుకుని కాలేజీకి దగ్గర్లో ఉన్న స్కూల్‌లో చేరాడని తెలిసి.. ఆ ప్రేమకు ఆశ్చర్యం, పొసెసివ్‌నెస్‌కి భయం కలిగిన మాట నిజం! తనకే కాదు, తన స్నేహితులకూ కేశవ తమ్ముడే! ఎవరికేది కావాలన్నా తెచ్చిపెట్టేవాడు.

వాళ్లు మొహమాటపడినా..

''ఏం ఫర్వాలేదక్కా! మా అక్కెంతో మీరూ అంతే!'' అనేవాడు. తనెప్పుడైనా..

''ఎందుకురా అందరి పనులూ నెత్తినేసుకుంటావు?!'' అన్నా కూడా..

''నీ ఫ్రెండ్సే కదక్కా! వాళ్లకేదైనా కావాలంటే నువ్వు వెంటవెళ్లాల్సిందే కదా! ఎండలోపడి ఆ ఊరంతా తిరగడం, అలసిపోవడం ఎందుకు?'' అనేవాడు.

తనకు సంబంధించిన ప్రతి విషయంలోనూ ఎంతో కేరింగ్‌గా ఉండేవాడు. కొన్నిసార్లు అమ్మానాన్నల కంటే కూడా కేశవనే ఎక్కువ శ్రద్ధ చూపించేవాడని అనిపించేది.

తనకు తెల్లకలువలు అంటే ఎంతో ఇష్టం. ఊరిచెరువు నిండా విచ్చుకుని ఉండేవి. తనకు వాటిని తెచ్చివ్వడం కోసమే ఏడేళ్ల వయసులో ఇంట్లో చెప్పకుండా ఈత నేర్చుకున్నాడు కేశవ. ఊరి నిండా వాడి స్నేహితులే! అయినా చింతకాయలు, మామిడికాయలు, రేగుపళ్లు, జామపళ్లు ... ఇలాంటివి తామిద్దరి మధ్యే. అన్నయ్య మాధవ తన కన్నా మూడేళ్లు పెద్ద అయినా ఎందుకో తన చదువేమో.. తనేమో అన్నట్టుండేవాడు.

డిగ్రీ చదువుతున్నప్పుడు తన సీనియర్ కృష్ణమోహన్ లవ్‌లెటర్ రాసి వాళ్ల తమ్ముడు రాజు చేతికిచ్చి పంపించాడు తనకు. ఇంట్లో పెద్దవాళ్లకు చెప్పడానికి భయపడి, స్నేహితులు ఆటపట్టిస్తుంటే ఆ ఉత్తరం చించి పారేద్దామని చూస్తే దొరకలేదు. అదెలా తెలుసుకున్నాడో గానీ ఆ ఉత్తరం చదివిన కేశవ.. కృష్ణమోహన్ దగ్గరికి సరాసరి వెళ్లిపోయి మాట్లాడాడట.

''ఆ ఉత్తరం టైంపాస్ కోసం రాశావా!? లేక నిజాయతీగా ఇష్టపడుతున్నావా?! మా అక్కపట్ల నీకు నిజంగా ప్రేముందా?! మా అక్కను పెళ్లి చేసుకోవాలంటే నీ డిగ్రీ పూర్తిచేసి మంచి ఉద్యోగం దొరికాక అప్పుడు మాట్లాడు.. అదికూడా మా అక్కకు ఇష్టమైతేనే! ఈలోగా ఏదైనా అల్లరి చేశావంటే నేను మంచోణ్ని కాను. మా అక్కకోసం ఏదైనా చేస్తాను'' అంటూ బెదిరించాడట. ఆ తరువాత తనను చూస్తేనే ఆమడదూరం పారిపోయేవాడు కృష్ణమోహన్. అప్పుడు కేశవ చదువుతున్నది ఇంటరే.

ఏళ్లు గడుస్తున్నకొద్దీ అక్కాచెల్లెళ్ల మధ్యకన్నా అన్నదమ్ముల మధ్యప్రేమ తగ్గుతుందంటారు. కానీ, కేశవ ప్రేమలో ఏమాత్రం మార్పు లేదు. ఇంకా పెరిగింది కూడా! డిగ్రీ అవుతూనే తన పెళ్లి అయింది. ఆ పెళ్లిలో సందడంతా కేశవదే! అమ్మకు ఇంట్లో అన్నీ సర్దిపెట్టడం నుంచీ, సామాన్లు తేవడం, ఎక్కడికంటే అక్కడికి వెళ్లడం లాంటి పనుల్లో నాన్నకు ఎంతసహాయం చేశాడో! నెలకోసారి తన అత్తవారింటికి చుట్టానికి వచ్చేవాడు కేశవ.

''మీ అక్కను పెళ్లి చేసుకుంటే నువ్వు బోనస్‌గా వచ్చావు. మరదలువైనా కాకపోతివి''.. అంటూ బావమరిదితో పరాచకాలాడేవాడు తన భర్త ఆనంద్. కేశవ నవ్వేసేవాడు.

ఆనంద్ నీటిపారుదల శాఖలో ఇంజినీరుగా నాగార్జున సాగర్, శ్రీశైలం, పోచంపాడులో పనిచేసేప్పుడు తనొక్కతే ఇంట్లో ఉంటుందని అప్పుడప్పుడూ కేశవ వచ్చి ఉండేవాడు. కొన్నిసార్లు క్యాంపుకెళ్లాల్సి వస్తే కేశవను ఆనందే పిలిపించేవాడు. అంతలా అతనికికూడా నచ్చాడు. ముగ్గురూ కలిసి సినిమాలకు వెళ్లేవాళ్లు, కార్డ్స్ ఆడేవాళ్లు, ఎట్లైనా పిక్నిక్‌లకు వెళ్లేవాళ్లు. కేశవ వస్తే తనకు ఎంతో సంతోషంగా, రిలీఫ్‌గా ఉండేది. వంటచేస్తుంటే కూరగాయలు కట్ చేసిస్తూ, చపాతీలు వత్తితే పెనం మీద కాలుస్తూ, ఎప్పుడైనా టైలర్ దగ్గరికో, మార్కెట్‌కో వెళ్తే తోడుగా వస్తూ ఉండేవాడు. ఇద్దరూ కలిసి బోలెడు పుస్తకాలు చదువుతూ ఆ కథల గురించీ, నవలల గురించీ చర్చించుకునే వాళ్లు.

శిరీష, శ్రీకాంత్ పుట్టినప్పుడు అమ్మ ఇంటికి వచ్చి వంటచేసి తీసుకొచ్చే టైంలోనూ, రాత్రంతా అమ్మతో బాటుగానూ హాస్పిటల్‌లో ఉండేవాడు. పిల్లలను ఎత్తుకోవడం, స్నానం పోయడం, బట్టలు తొడగడం ఎంతబాగా అలవాటు చేసుకున్నాడో!

అన్నయ్య బాగా చదువుకుని అమెరికాకు వెళ్లడం, మధ్యలో ఓ పెద్దింటి అమ్మాయి సంబంధం నచ్చి పెళ్లి చేసుకోవడం, ఇద్దరు పిల్లలూ అమెరికాలోనే పుట్టడం, అక్కడే బాగా సెటిలవడం జరిగిపోయాయి. కేశవ మాత్రం డిగ్రీ దాకానే చదివి అమ్మానాన్నలకోసం ఆ ఊర్లోనే ఉంటూ వ్యవసాయం చేపట్టాడు. వ్యవసాయం చేస్తున్నాడని తనకు పెళ్లి సంబంధాలు పెద్దగా రాలేదు.

ఓ పేదింటి అమ్మాయిని కట్నమేమీ తీసుకోకుండా చేసుకోవాలనేది కేశవ కోరిక. అలాగే తను ఎన్నికచేసిన లక్ష్మి కోడలిగా ఆ ఇంటికి వచ్చింది. మంచీ, మర్యాదా ఉన్న అమ్మాయి. ముఖ్యంగా కేశవను అర్థం చేసుకుని వాడి జీవితంలో అంతర్వాహినిలా కలిసిపోయింది.

చూస్తూ ఉండగానే ఏళ్లు గడిచాయి. కేశవ దంపతుల చేతుల్లో సంతృప్తిగా కన్నుమూశారు అమ్మానాన్న. మాధవన్నయ్య కూతురు పెళ్లిఖర్చుల కోసమని ఊర్లో ఉన్నపొలంలో తన వాటా సగం అమ్మి భారత్‌లోనే చాలా గ్రాండ్‌గా పెళ్లిచేశాడు. పంపకాల్లో రెండెకరాల పొలమే కేశవకు మిగిలింది. ఊర్లో ఉన్న ఇల్లు మాత్రం..

''నువ్వు అమ్మానాన్నల్ని చూశావుగా.. అందుకని ఇంట్లో నాకేమీ వాటావద్దు!'' అన్నాడు మాధవ ఉదారంగా. కేశవ ఏమీ మాట్లాడలేదు.

